క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలకు 21 మంది గైర్హాజర్

పుంగనూరు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మంగళవారం 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలో మూడు సెంటర్లలో పర్యవేక్షణాధికారులు రెడ్డెప్ప, కమలాకర్, విజయకుమారి ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. మూడు సెంటర్లలో 792 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

జూదరుల అరెస్టు

రొంపిచెర్ల: పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, 3.800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. చిచ్చిలివారిపల్లె పంచాయతీ తొప్పిరెడ్డిగారిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు దాడి చేసి వినోద్ నాయక్(24), సహదేవ(54), రామచంద్రయ్య(34)ను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. మరో వ్యక్తి గోపి(35) పరారయ్యాడని తెలిపారు. నిందితుల నుంచి రూ.3.800 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలాలపై ఒంటరి ఏనుగు దాడి

రామకుప్పం: మండలంలోని ననియాల అటవీ పరిధిలో మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు సంచరిస్తోంది. పరిసర గ్రామాల్లోని పంట పొలాలపై దాడి చేసిందని రైతులు తెలియజేస్తున్నారు.

తాగునీటి ప్రాధాన్యతపై ర్యాలీ



పుంగనూరు: ప్రజల జీవన మనుగడకు ఎంతో అవసరమైన మంచినీటిని కలుషితం, వృథా చేయకూడదని జలజీవన్ మిషన్ సభ్యులు తిప్పానాయక్, సమత, సర్పంచ్ గౌరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని చదళ్ల గ్రామంలో జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో తాగునీటి ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పంపిణీ

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రవికుమార్(రాజన్న) కుటుంబానికి మంగళవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందించారు. రవికుమార్ అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. తక్షణ సాయంగా అంత్యక్రియల కోసం మృతుని భార్య యశోదకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల బీమా నగదును ఏఎంసీ డైరెక్టర్ సురేష్ అందజేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమావాస్య పూజలు



బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె బాట గంగమ్మ ఆలయంలో మంగళవారం అమావాస్య పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం అనంతరం విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కుప్పం తహసీల్దార్‌గా పార్వతి

కుప్పం: కుప్పం తహశీల్దార్‌గా పార్వతిని నియమిస్తు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డిప్యూటీ తహశీల్దార్ దేవరాజ్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. చిత్తూరు నుంచి ఇక్కడికి బదిలీ అయిన పార్వతి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

వి.కోట: ఉన్నత లక్ష్యంతో చదివితే విజయం తానంతట అదే వరిస్తుందని ఎంఈఓ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ఖాజీపేటలోని ఉర్దూ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం ఇలియాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

చౌడేపల్లె: ఘర్షణ కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ మంగళవారం రాత్రి తెలిపారు. వివరాలు..గడ్డంవారిపల్లె పంచాయతీ తెల్లనీళ్లపల్లెకు చెందిన ఓబులేసు, విజయలక్ష్మి దంపతుల కుమార్తె హర్షిత(8), అదే గ్రామానికి చెందిన వినాయకరెడ్డి కుమారుడు భరత్ రెడ్డి (8) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడోతరగతి చదువుతున్నారు. పాఠశాలలో హర్షితను భరత్‌రెడ్డి ముందుకు నెట్టడంతో చెయ్యి విరిగింది. ఈ విషయమై ఇరువురు విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువురు ఫిర్యాదు మేరకు వేర్వేరుగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మిద్దె పైనుంచి పడి ఒకరి మృతి

చౌడేపల్లె : స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద ఓ వ్యక్తి మంగళవారం రాత్రి మిద్దెపై నుంచి జారి పడి మృతి చెందాడు. వివరాలు.. పుంగనూరు మండలం ఏటవాకిలికి చెందిన రామిరెడ్డి(42) చిత్రెట్టిపల్లె వద్ద నర్సరీ నడుపుకుంటున్నాడు. ఆయన ఓ రెండస్తుల భవనంలోని ఓ పోర్షన్‌లో అద్దెకు నివసిస్తున్నాడు. పిట్టగోడలేని ఆ మిద్దెపైకి ఎక్కి ఫోన్‌లో బంధువులతో మాట్లాడుతూ పొరపాటున కాలు జారి కిందపడిపోయాడు. అక్కడికక్కడే మరణించాడు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం





పలమనేరులో రాగిజావ తాగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, కుప్పంలో విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

పలమనేరు: నేటి బాలలే రేపటి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్‌కు సారథులని, రాగిజావలో 8 రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, దీన్ని తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో రోగ నిరోధక శక్తిని పెరుగుతుందని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర పేర్కొన్నారు. పలమనేరు మున్సిపాలిటీ, మండలంలో జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు మంగళవారం రాగిజావ పంపిణీ చేశారు. పట్టణంలోని జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో జావ పంపిణీని పవిత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో మెనూ మార్చి మెరుగైన పౌష్టికాహారాన్ని ఈ ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఎంఈవో లీలారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, రాష్ట్ర కార్యదర్శులు రంగన్న, మురళీకృష్ణ, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కుప్పం: రాగిజావతో పౌష్టికాహారం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఎంపీపీ అశ్విని, ఎంఈఓ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పుంగనూరు: మద్దనపల్లె ఎంపీపీ స్కూల్‌లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణంరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో ప్రోత్సాహకాలను అందజేస్తోందని తెలిపారు. ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అర్బన్, రూరల్ పరిధిలో 139 పాఠశాలల్లో రాగిజావ పంపిణీ చేశామన్నారు.



బైరెడ్డిపల్లెలో..



వి.కోట: కృష్ణాపురం పాఠశాలలో..

సోమల: మండలంలోని 58 పాఠశాలల్లో 3957 మంది విద్యార్థులకు రాగిజావను అందజేశారు. కరకమందలో సర్పంచ్ వెంకటరమణ పంపిణీని ప్రారంభించారు.

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల హైస్కూల్లో విద్యార్థులకు రాగి గంజి పంపిణీని సర్పంచ్ రాణెమ్మ ప్రారంభించారు. హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకుప్పం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్, బాలికల హైస్కూల్, రామకుప్పం, కెంచనబల్ల, ఎంపీయూపీ పాఠశాలలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి రాగిజావా పంపిణీని ప్రారంభించారు. వైస్ సర్పంచ్ ఏజస్, వార్డు సభ్యుడు జమీను ప్రసాద్, యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

కుప్పంరూరల్: మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు రాగజావ పంపిణీ చేశారు. వేపూరు ప్రాథమిక పాఠశాలలో స్థానిక నాయకులు షౌకత్, కోడెప్ప, మోడల్ కాలనీ పాఠశాలలో మున్సిపల్ వైస్ చైర్మెన్ హఫీజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పెద్దపంజాణి: స్థానిక ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప ప్రారంభించారు. నాయకులు జాఫర్, రెడ్డి బాషా పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె బాలుర ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని జెడ్పీటీసీ ఆర్.కేశువులు ప్రారంభించారు. హెచ్ఎం విశ్వనాథ్ పాల్గొన్నారు.

వి.కోట: కృష్ణాపురం ఉన్నత పాఠశాలలో సర్పంచ్ రమేష్ బిల్లా, గోనుమాకులపల్లె ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ జ్యోతిబాలాజీ రాగిజావ పంపిణీని ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు చిదంబరం, ప్రజాప్రతినిధులు, విద్యాకమిటీ కమిటీ చైర్మెన్ పాల్గొన్నారు.



పెద్దపంజాణిలో..



కుప్పం రూరల్: వేపూరు పాఠశాలలో



రామకుప్పం: రాగిజావ పంపిణీ



పులిచెర్లలో..



సోమల : కరకమందలో ..



పుంగనూరు: మద్దనపల్లెలో

సమస్యల పరిష్కారానికి కృషి





సదుం: సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి, ప్రత్యేక ప్రతిభావంతుని సమస్య ఆలకిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

సదుం: ప్రజా సమస్యల పరిష్కారానికి తామెప్పుడు ముందుంటామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రాతివారిపల్లెలో మంగళవారం ప్రజలు వారిని కలిసి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. వారు అధికారులతో మాట్లాడి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీలు ఎల్లప్ప, సురేంద్రనాథ్‌రెడ్డి, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, నాయకులు నాగభూషణంరెడ్డి, పుత్రాజు, గిరిధర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సయ్యద్‌బాషా, ఖాజాపీర్, దా ము, శివ, నాగేశ్వర్ రావు, నాగభూషణంరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు గ్రహీతకు అభినందన

సదుం మండంలోని నడిగడ్డకు చెందిన గిన్నిస్ రికార్డు గ్రహీత మల్లికార్జునను ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎర్రాతివారిపల్లెలో మంగళవారం అభినందించారు. ఆయన యోగాసనం, అంతర్జాతీయ కాలింగ్ కోడ్‌లను గుర్తించడంలో రెండు సార్లు గిన్నిస్ రికార్డు సాధించారు. గిన్నిస్ రికార్డుతో మండలానికి మంచి పేరు తీసుకువచ్చారని ఎంపీ ప్రశంసించారు. అలాగే ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆయనను అభినందించారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, పుత్రాజు, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



మల్లికార్జునకు ఎంపీ మిథున్‌రెడ్డి అభినందన

నూతన సాంకేతిక పద్ధతులు ఎంతో మేలు



టమాట గ్రేడింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: నూతన సాంకేతిక పద్ధతులు రైతులకు ఎంతో మేలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. పలమనేరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన టమాటా గ్రేడింగ్ యంత్రం ట్రైల్‌రన్‌ను ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డితో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈప్రాంతంలో రైతులు టమాటాను సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాదంతా సాగుచేస్తుంటారన్నారు. పొలాల వద్ద కూలీలు ఎంత గ్రేడింగ్ చేసినా కొన్ని సమస్యలుంటాయన్నారు. ఇక్కడి టమాటాలు విదేశాలకు ఎగుమతులవుతున్న తరుణంలో క్వాలిటీతోపాటు నాణ్యతకు పెద్దపీట వేయాలన్నారు. యంత్రాల ద్వారా గ్రేడింగ్ చేస్తే సరుకును కొనేందుకు వ్యాపారులు మరింత ఆసక్తిని చూపడం ఖాయమన్నారు. యంత్రం పనితీరు, గ్రేడింగ్‌తో జరిగే మేలును మార్కెట్ కమిటీ సెక్రటరీ సంజీవ్‌కుమార్ సూచించారు. ఏఎంసీ సిబ్బంది జ్ఞానాంబ, శంకర్‌రెడ్డి, రత్నమ్మ, లోకేష్‌కుమార్, కమిటీ మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం వద్దు

వి.కోట: మండలంలో జగనన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ, వెలుగు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అవసరమైన వారికి వెలుగు ద్వారా వీలైనంత త్వరగా రుణాలు మంజూరయ్యేలా చూడాలని తెలిపారు. ఎంపీపీ యువరాజు, ఏఈ, ఉపాధి ఏపీఓ, వెలుగు సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల వేగం పెంచాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన గృహ నిర్మాణాల ప్రగతిపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, నాదమునిరెడ్డి, వైస్ ఎంపీపీ రాశి ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగరాజ ప్రసాద్, నాగిరెడ్డి, ఎంపీడీఓ సుగుణమ్మ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

పోలీస్‌స్టేషన్ చేరిన పది ప్రశ్నపత్రాలు

పలమనేరు: పదోతరగతి ప్రశ్నపత్రాలు భద్రత మధ్య మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌కు చేరాయి. స్టేషన్ కస్టోడియన్ కొలమాసనపల్లె హైస్కూల్ హెచ్ఎం విజయకుమార్ వీటిని భద్రపరిచి సీలు వేశారు. ఎంఈవో లీలారాణి, మండలంలోని ఏడు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: పదవ తగరతి పశ్న పత్రాలు మంగళవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు చేరాయి. మండలంలో రొంపిచెర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు ఎంఈవో హసన్‌బాషా తెలిపారు. మండలంలో 279 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. పులిచెర్ల ఎంఈవో సిద్ధరామయ్య, పరీక్ష చీఫ్ అధికారులు సుమలత, గిరిప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోమల: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్న పత్రాలు చిత్తూరు నుంచి భద్రత నడుమ ప్రత్యేక వాహనంలో మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. మండలంలో ఐదు ఉన్నత పాఠశాలలకు సంబంధించి 341 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఎంఈఓ కేశవపిళ్లై తెలిపారు.

బైరెడ్డిపల్లె: ఏప్రిల్ 3న జరగనున్న పదో తరగతి పరీక్షల ప్రశ్న పత్రాలు మంగళవారం బైరెడ్డిపల్లెకి చేరుకున్నాయి. పోలీసు స్టేషన్‌లో వాటిని రూట్ ఆఫీసర్లు భద్రపరిచారు. ఎస్ఐ వెంకట నరశింహులు పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు): పదవతరగతి పరీక్ష ప్రశ్నాపత్రాలు మంగళవారం కల్లూరు పోలీస్టేషన్‌కు చేరినట్లు ఎస్సై రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. కల్లూరు సెంటర్లో 250, మంగళంపేటలో 168 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ సిద్ధరామయ్య తెలిపారు.

గృహ సారథులు కీలకంగా పనిచేయాలి

రొంపిచెర్ల: గ్రామాల్లో పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో గృహ సారథులు కీలకంగా పని చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. మండలంలోని 8 గ్రామ సచివాలయాల గృహ సారథులతో సమావేశాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పథకాలను అందజేయడంలో గృహ సారథులు, వలంటీర్లు కలసి పని చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల లబ్ధిని ఇంటింటికీ వివరించాలని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డిశ్వర్ రెడ్డి, మంత్రి పీఏ ముని తుకారం, వైస్ ఎంపీపీలు విజయశేఖర్, నూలు రెడ్డెప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, రమణయ్య, జీవలత, హేమలత, సుధారాణి, సుష్మా, ఎంపీటీసీ సభ్యులు రమణమ్మ, లక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి

అడవులను సంరక్షించుకుందాం

పలమనేరు: అటవీ సంరక్షణ అందరి బాధ్యతని పలమనేరు రేంజి ఎఫ్ఎస్వో సుకుమార్ పేర్కొన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాణి కళాశాల విద్యార్థులతో మండిపేట అటవీప్రాంతంలోని ఎలిఫెంట్ వాచ్ టవర్ వద్ద నేచర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా అడవులను కాపాడుకోవాల్సిన అవసరం సమాజంపై ఉందన్నారు. పలువురు సెక్షన్, బీట్, సహాయ బీట్ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పెద్దపంజాణి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీపీ ఎస్. రెడ్డెప్ప అన్నారు. అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సెక్షన్ ఆఫీసర్ సురేంద్ర, ఎఫ్‌బీఓలు దొరస్వామి, రవి, యుగంధర్, రాజశేఖర్, ఏబీఓ రాధమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు జాఫర్, రెడ్డిబాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ రేపు

పుంగనూరు: పట్టణంలోని మూడు కోర్టుల విధులను ఈనెల 23, 24 తేదీల్లో బహిష్కరించనున్నట్లు న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విజయవాడ న్యాయవాది వి.భగవాన్‌పై పోలీసుల దాడికి నిరసనగా రెండు రోజులు విధులు బహిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

చౌడేపల్లె: అకాల వర్షాలతో రైతులు వ్యవసాయ బోర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వర్షం కురిసేటప్పుడు చెట్ల వద్ద విద్యుత్ స్తంభాలు, కరెంటు తీగలకు సమీపంలో ఉండకూడదన్నారు. బోర్ల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వైర్లు కిందకు వేలాడుతున్నా, జాయింట్‌లు ఉన్నా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం





సాయిగిరీష్, సూర్యప్రకాష్

రామకుప్పం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి రఘుపతి రెడ్డి తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా పాల్‌దేవ్, అధ్యక్షుడిగా సాయి గిరీష్, ప్రధాన కార్యదర్శిగా సూర్యప్రకాష్, కోశాధికారిగా మగేష్, కార్యదర్శులుగా పార్థు, పురుషోత్తం, జిల్లా కౌన్సిలర్లుగా నారాయణ, రవి, సీపీఎస్ కన్వీనర్‌గా ఉత్తమ కుమార్, మహిళా కన్వీనర్లుగా సుబ్బమ్మ, షకీరాతోపాటు 25 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

రెండు బైకులు ఢీ : నలుగురికి తీవ్రగాయాలు

వి.కోట: వి.కోట– పేర్నంభట్ రహదారిలోని పాపేపల్లి మిట్ట వద్ద మంగళవారం రాత్రి ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం.. మండలంలోని బైరుపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు నవీన్ (17), శ్రీనివాసులు కుమారుడు శ్రీనిధి(21) రాజన్న కుమారుడు మురుగేష్ (21) గ్రామం నుంచి వి.కోట పట్టణం వైపు ఒకే బైక్‌పై వస్తున్నారు. అదే సమయంలో రామకుప్పం మండలం చిన్న గెరిగిపల్లెకు చెందిన సంపంగిరెడ్డి కుమారుడు రాజేష్(21) వి.కోట నుంచి గ్రామానికి బైక్‌లో వెళుతున్నాడు. పాపేపల్లి మిట్ట వద్ద రెండు బైకులూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వి.కోట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమచికిత్స అనంతరం కుప్పం పీఈఎస్‌కు తరలించారు. కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.

కుప్పంలో ఉగాది రద్దీ



జనంతో కిక్కిరిసిన వీధి

కుప్పం: తెలుగు నూతన సంవత్సరాది పండుగకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు జనం భారీగా తరలిరావడంతో పట్టణ వీధులు మంగళవారం కిక్కిరిశాయి. ఈ ప్రాంతంలో ఉగాది పండుగను రెండు రోజులు వరుసగా జరుపుకుంటారు. ఉగాది రోజున వేప పచ్చడితో సంబరాలు జరుపు కుంటారు. శ్మశానాల్లో పెద్దల సమాధుల వద్ద పూజలు చేసి, నూతన వస్త్రాలు సమర్పిస్తారు. మరుసటి రోజు విందు భోజనాలు చేస్తారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు స్వగ్రామాలకు వచ్చి రంగులు చల్లుకుని, మిత్రులు, బంధువర్గాలతో విందు భోజనాలు చేస్తారు. వీటికి కావాల్సిన సామగ్రి, వస్త్రాల కొనుగోలు కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు రావడంతో పట్టణంలో పలువీధులు కిక్కిరిశాయి.